క్లుప్తంగా

19న శివాలయ భూములకు వేలం

పలమనేరు: పట్టణంలోని శివాలయానికి చెందిన పలు భూముల మూడేళ్ల కౌలుకు సంబంధించిన బహిరంగ వేలం ఈనెల 19న స్థానిక శివాలయంలో జరుగుతుందని ఈఓ కమలాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న జరగాల్సిన వేలం కొన్ని కారణాలతో వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు ధరావత్తు చెల్లించాలని అందులో సూచించారు.

బాల్యవివాహాలను అరికడదాం


మాట్లాడుతున్న సీడీపీఓ అమరజ్యోతి

చౌడేపల్లె: గ్రామస్థాయి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమష్టిగా కృషి చేసి బాల్యవివాహాలను అరికడదామని ఐసీడీఎస్ ఏసీడీపీఓ అమరజ్యోతి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పౌష్టికాహార లోపంతో రక్తహీనత ద్వారా మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రమాదకరమని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలొస్తాయని పేర్కొన్నారు. పోక్సో చట్టం ప్రత్యేకతను ఎస్ఐ నాగేశ్వరరావు, విద్యకున్న ప్రాముఖ్యతను ఎంఈఓ కేశవరెడ్డి వివరించారు. ఏఓ షబ్బీర్ అహ్మద్, ఈఓపీఆర్డీ కృష్ణవేణి, ఏపీఎం సుబ్రమణ్యం, డాక్టర్ పవన్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన పాల్గొన్నారు.

దళిత నేత మృతి


గంగాధర్ (ఫైల్)

పుంగనూరు: మండలంలోని కపాడంమిట్టపల్లెలో ఉన్న దళిత నాయకుడు గంగాధర్(58) అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఏపీ రాష్ట్ర దళిత సంక్షేమ సమితి అధ్యక్షుడు శంకరప్ప కపాడంమిట్టపల్లెకి వెళ్లి గంగాధర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

21న దివ్యాంగుల శిబిరం

- ఆర్డీఓ భవాని


హైస్కూల్‌లో ఆర్డీఓ భవాని, కమిషనర్

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో ఈనెల 21న దివ్యాంగుల శిబిరం నిర్వహిస్తున్నట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రాముతో కలసి బసవరాజ హైస్కూల్‌ను పరిశీలించారు. దివ్యాంగులకు విశ్రాంతి గది, నీరు, వారికి ఆరోగ్య పరీక్షలకు అనుకూలమైన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈనెల 21న పుంగనూరు నియోజకవర్గంలోని దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసం


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

గుడుపల్లె: బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసం కార్యక్రమం పునాది వేస్తుందని తహసీల్దార్ శీతారాం అన్నారు. గురువారం స్థానిక శ్రీశక్తి భవనంలో సచివాలయం, ఐసీడీఎస్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలికల ఉజ్వల భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన సాధికారత దిశగా అడుగులు వేసి సమష్టి కృషితో చేయూత అందించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. 12 నుంచి 18 సంవత్సరాల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వాలంబన మెరుగు పరచడమే లక్ష్యమన్నారు. ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాక్రిష్ణ, ఐటీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని సచివాలయంలో నేడు శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు వీఆర్వో శ్రీపతిరెడ్డి తెలిపారు. రెవెన్యూ సమస్యలున్న రైతులు సమస్యను వివరిస్తూ, సంబంధిత రికార్డుల జిరాక్స్ పత్రాలను జతచేసి అర్జీ ఇవ్వాలన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బంగారుపాళెం: స్థానిక బంగారుపాళెం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గురువారం తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మండల రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

వర్షార్పణం

- వర్షానికి నేలవాలిన వరి
- ఒబ్బిళ్లలో వానకు తడుస్తున్న వరి, పశుగ్రాసం
- మల్బరీ రైతులకు మేత కష్టాలు
- టమాటాకు మరింత నష్టం
- నియోజకవర్గంలో స్తంభించిన జనజీవనం


వర్షం కారణంగా నక్కపల్లి వద్ద నేలవాలిన వరి

పలమనేరు: నైరుతి ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా పలమనేరు నియోజకవర్గంలో గురువారం వేకువజాము నుంచి జడివాన ఆగకుండా పడుతూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. మరోవైపు ఇది వాయుగుండంగా మారి రానున్న 48 గంటల్లో మరింత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ వర్షం కారణంగా రైతులకు మేలు కంటే నష్టాలే ఎక్కువైనట్టు తెలుస్తోంది. పంట నష్టంపై కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

నేలవాలిన వరి పంట

రబీలో ఇక్కడ సాగైన వరి ఫెంగల్ తుపాను కారణంగా వంద ఎకరాల్లో నేలవాలింది. మరో 50శాతం కోతకొచ్చిన వరిని ఒబ్బిళ్ల చేసుకొనే సమయంలో ఈ వర్షం కారణంగా ఇబ్బందిగా మారింది. ఇప్పటికే మండలంలో వందలాది ఎకరాల దాకా వరి నేలవాలినట్టు రైతులు తెలిపారు. ఇదే విధంగా మరో నాలుగు రోజులు వాన పడితే నేలవాలిన వరి మొలకెత్తడం ఖాయమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో నష్టాలు తప్పవనే భయం అన్నదాతలకు పట్టుకుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు పశువులకు గడ్డి కోసమే వరిని సాగు చేస్తుంటారు. అయితే వర్షాలకు తడిచిన వరిపంట, లేదా ఇప్పటికే ఒబ్బిడి చేసిన పశుగ్రాసం కుళ్లిపోయి ఎందుకూ పనికి రాకుండాపోతుంది.

టమాటాకు తీరని నష్టం

ప్రస్తుతం ఈ ప్రాంతంలో 2వేల ఎకరాల్లో టమాట కోత దశలో ఉంది. ఇప్పటికే ధరలు అమాంతం తగ్గి రైతులు నష్టాల బాటలో ఉన్నారు. ఈతరుణంలో వాన కారణంగా టమాటకు వైరస్ తెగుళ్లు సోకి కాయలు దెబ్బతిని వాటి నాణ్యత తగ్గడం ఖాయం. దీంతో పాటు తోటల్లోనే కాయలు కుళ్లిపోతున్నాయి. దీంతో టమాట రైతులకు వర్షం కారణంగా భారీ నష్టాలు తప్పని పరిస్థితి వర్షాల వల్ల నెలకొంది.



మాదిగబండ రోడ్డులో నిలిచిన వర్షపునీరు, మండలంలో చేలలో తడుస్తున్న వరి గడ్డి

పట్టుపురుగులకు మేత కష్టాలు

ఈ ప్రాంతంలో 2వేల ఎకరాల్లో మల్బరీని సాగుచేస్తున్నారు. వెయ్యిమంది రైతులు ఇప్పుడు పట్టు పురుగుల పెంపకాన్ని చేపడుతున్నారు. మల్బరీ పురుగులకు తడిచిన మల్బరీ ఆకును మేతగా వేస్తే నష్టం తప్పదు. దీంతో మల్బరీ ఆకును ఫ్యాన్లతో ఆరబెట్టి ఆపై పురుగులకు వేయాల్సి వస్తోంది. ఉన్నట్టుండి భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు, తడిచిన మేత కారణంగా పురుగులకు రోగం సోకి అవి గూళ్లను కట్టలేని పరిస్థితి రావడం తప్పదని పట్టు రైతులు బాధపడుతున్నారు. ఇక పశువులకు మేత కష్టం తప్పడం లేదు.

స్తంభించిన జనజీవనం

తెరిపి లేకుండా కురుస్తున్న జడివాన కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. జనం ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరి రొచ్చురొచ్చుగా మారింది. ఇక గ్రామీణ రోడ్లు బురదమయమై అధ్వాన్నంగా తయారయ్యాయి. మండలంలోని నాగమంగళం గ్రామం వద్ద హైవేపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇదే మండలంలోని మాదిగబండ వద్ద రోడ్డుపై వరద నీరు నిలవడంతో రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. పంట నష్టంపై ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

చివరిలో నష్టం

బైరెడ్డిపల్లె: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో అల్పపీడనం ప్రభావంతో అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. వరి పంట కోతల సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒబ్బిడి చేసిన రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంత మంది రైతులు వరి కోతలు కోసి పొలాల్లోనే వదిలి పెట్టారు. వర్షాలు ఇలాగే కొనసాగితే మొలకలు వచ్చే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు సక్రమంగా లేకపోవడంతో ఒడ్లు మగ్గిపోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


శెట్టిపల్లెలో పొలాల్లోనే వదిలేసిన వరిపంట

మామిడి తోటలకు బీమా నమోదు


లక్ష్మీప్రసూన

పలమనేరు: మామిడి తోటలకు బీమా పథకం వచ్చిందని, ఇందుకు సంబంధించిన రైతులు పంటల నమోదు చేసుకోవాలని పలమనేరు హార్టికల్చర్ అధికారిణి లక్ష్మీప్రసూన గురువారం తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో వాతావరణ ఆధారిత బీమాగా ఇది అమలుకానుందని తెలిపారు. బీమా చేసుకోవాలనుకునే మామిడి రైతులు సమీపంలోని బ్యాంకు, సీఎస్సీ, మీసేవ, బీమా కంపెనీ ఏజెంట్లు లేదా పీఎంఎఫ్‌బీవై పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం బ్యాంకు ఖాతా, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, పంట ఉన్నట్టు ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది మే 31 దాకా పంట నష్టంపై పరిహారం అందుతుందని తెలిపారు. ఇందుకోసం ఎకరా మామిడికి బీమా ప్రీమియంగా రూ.1,750 చెల్లించాలని, నష్టపరిహారం వస్తే రూ.35వేలు దక్కే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లను సైతం తమ శాఖ సబ్సిడీతో ఇవ్వనుందని, వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా హార్టికల్చర్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

కిశోర వికాసంపై శిక్షణ


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సదుం: కిశోర వికాసంపై ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 15 నుంచి 18 సంవత్సరాలు ఉన్న కిశోర బాలికలు తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు, రక్తహీనత, బాల్యవివాహాల అనర్థాలను వివరించారు. వాటిని అరికడదామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు, తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, ఎస్ఐ షేక్‌షావలి, డాక్టర్ గిరీషా, ఎంఈఓ సిద్ధరామయ్య, దామోదర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, ఏపీఎం హరిప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్లు బురదమయం.. ప్రయాణం నరకం



రొంపిచెర్ల టీటీడీ కల్యాణ మండలం సమీపంలో గుంతలు పడి నిలిచి పోయిన నీరు, రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద..

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో కురిసిన వర్షాలకు గ్రామీణ రోడ్లు బురద కంపుకొడుతున్నాయి. రోడ్డు మీద నడవాలంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే పాలకులు మాత్రమే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తలపల రోడ్డు నుంచి రంగన్నగారిగడ్డ వరకు 15 కిలోమీటర్ల డబుల్‌రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి, ప్రస్తుత పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం నుంచి రూ.12 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో అధికారులు పనులకు టెండర్లు కూడా నిర్వహించారు. అయితే రోడ్డు పనులు మాత్రం ఇంతవరకు చేపట్టలేదు. ఈరోడ్డు బాగా గుంతలమయమైంది. టీటీడీ కల్యాణ మండపంలో సమీపంలో తారు రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ద్విచక్ర వాహనాదారులు కూడా బురద గుంతలో పడి లేచిపోతున్నారు. బోడిపాటివారిపల్లెలో రోడ్డు నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. జంగా నారాయణరెడ్డి కాలనీకి వెళ్లే రోడ్డు కూడా గుంతలు పడడంతో నడిచి పోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కూడా తారు రోడ్డు గుంతలు పడింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని మురుగుతున్న నిధులను ఖర్చు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


జంగానారాయణరెడ్డి కాలనీ రోడ్డు

వర్షం.. వర్షం


రొంపిచెర్లలో కురుస్తున్న వర్షం

రొంపిచెర్ల: గత పది రోజులుగా రొంపిచెర్లలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు సాగు చేసిన వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయి. ఫెంగల్ తుపానుతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. వర్షంతో వరి, టమాట, వేరుశనగ పంటల దెబ్బతిన్నాయి. అయితే మళ్లీ బుధవారం నుంచి వర్షాలు పడుతున్నాయి. దీంతో వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలందరూ ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. రొంపిచెర్లలో వర్షంతో ఎక్కడ జనసంచారం కనపడడం లేదు.

సదుంలో ముసురు వర్షం

సదుం: మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. సాధారణ జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. రైతులు వరి కోతలు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం వరకు వర్షంతో ఎటువంటి నష్టం లేదని రెవెన్యూ అధికారులు చెప్పారు.

పుంగనూరులో కుండపోత


పుంగనూరులో కురుస్తున్న వర్షం

పుంగనూరు: రెండు రోజులుగా వర్షం కురుస్తున్నా అందరూ సేద దీరుతున్నా సామాన్యుడికి మాత్రం సేద తీరే అవకాశం లభించలేదు. గురువారం భారీ వర్షం కురుస్తున్నా సామాన్య జనం మాత్రం తమ అవసరాల నిమిత్తం గొడుగులు పట్టుకుని తిరగడం గమనార్హం. అలాగే పూలు విక్రయించే మహిళలు సైతం గొడుగులు పట్టుకుని విక్రయించారు. పండ్ల వ్యాపారులు తోపుడుబండ్లకు పట్టలు వేసుకుని విక్రయాలు సాగించారు. అలాగే రైతులు తమ పశువులను వర్షం పడుతున్నా పొలాల్లోకి మేతకు తీసుకెళ్లారు. గత వారం కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొంత మేరకు పంటలను ఒబ్బిడి చేసే సమయంలో తిరిగి తుపాను రావడంతో పంట నష్టం తీవ్రమైంది.

వర్షంలోనూ పాఠశాల నిర్వహణ

- నారాయణలో నిబంధనలు గాలికి


పుంగనూరు: రాగానిపల్లె రోడ్డులోని నారాయణ స్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు: రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. కానీ పట్టణంలోని రాగానిపల్లె రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ మాత్రం ఇందుకు విరుద్ధంగా నిబంధనలను గాలికి వదిలి తమను ఎవరు ఏమీ చేయలేరన్న ధీమాతో పాఠశాలను నిర్వహించడం పలు విమర్శలకు దారితీస్తోంది. మంత్రి నారాయణకు చెందిన పాఠశాలలు మాత్రం ఎలా కొనసాగిస్తారంటూ మిగిలిన పాఠశాలల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వీటిపై డీఈఓ చర్యలు తీసుకుంటారా లేదా వేచి చూడాల్సి ఉంది.

బస్సు రద్దు.. విద్యార్థులకు తిప్పలు


పలమనేరు బస్టాండులో విద్యార్థులు

- వర్షం కారణంగా రద్దు చేశామన్న ఆర్టీసీ అధికారులు

పలమనేరు: రెగ్యులర్‌గా వస్తున్న ఆర్టీసీ బస్సు రాకపోవడంతో దాసార్లపల్లి మార్గంలో వెళ్లే విద్యార్థులు ఇక్కట్లు పడిన సంఘటన గురువారం పలమనేరులో చోటుచేసుకుంది. పలమనేరు నుంచి విద్యార్థుల సౌకర్యార్థం సాయంత్రం ఐదు గంటలకు పలమనేరు నుంచి వయా లక్కనపల్లి మీదుగా పది గ్రామాల విద్యార్థులకు సౌకర్యంగా దాసార్లపల్లి దాకా ఈ బస్సు నడిచేది. ఈమార్గంలో ఈ బస్సు తప్ప ఇతర సర్వీసులు లేవు. అయితే గురువారం వర్షాల కారణంగా పాఠశాలలకు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. దీన్ని చూసి స్థానిక ఆర్టీసీ అధికారులు దాసార్లపల్లి బస్సును రద్దు చేశారు. అయితే డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు నడుస్తున్నందున కళాశాలకు సెలవు ఇవ్వలేదు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండుకు రావడంతో ఎంతసేపటికి బస్సు రాకపోవడంతో వేచి చూశారు. ఆపై అక్కడున్న కంట్రోల్ పాయింట్‌ను సంప్రదిస్తే బస్సు రద్దు చేశారని చెప్పారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యార్థులు చాలా ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణానికి బ్రేక్

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం వద్ద ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న భవనాన్ని తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆగ్రామ వీఆర్వో పవన్‌కుమార్ బుధవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం పేరిట బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ ఇన్బునాథన్ స్పందించారు. టీఎస్ అగ్రహారం రోడ్డులో అదే గ్రామానికి చెందిన కొత్తింటోళ్ల రామిరెడ్డి డీకేటీ భూమికి సమీపంలో సర్వే నంబర్.834/17లో ప్రభుత్వ అనాధీనం పోరంబోకు భూమి 4 సెంట్లలో రైతు కుమారుడు శంకరయ్య ఇంటిని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.


అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వీఆర్వో

రెవెన్యూ సదస్సులు వెలవెల


సముద్రపల్లి రెవెన్యూ సదస్సుకు హాజరైన జనం


సదుంలో అర్జీ తీసుకుంటున్న తహసీల్దార్

పలమనేరు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సులకు ప్రజల నుంచి స్పందన రావడంలేదు. అధికారులు వేచి ఉన్నా పట్టుమంటే పది అర్జీలు కూడా రావడంలేదు. దీంతో అధికారులు సైతం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆమేరకు సముద్రపల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు పది మంది కూడా హాజరుకాలేదు. అయితే వర్షం కారణంగానే జనం రావడంలేదని అధికారులు చెబుతున్నారు.

సదుంలో..

సదుం: భూసమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్ తెలిపారు. స్థానిక సచివాలయంలో నిర్వహించిన సదస్సులో 10 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులో 22 అర్జీలు

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ బాలసముద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 22 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవి తెలిపారు. నిర్ణీత గడువులోపు రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

స్వామిసేవలో ఆలయ పునర్నిర్మాణ దాత


స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు అందజేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, వాసు, చిట్టిబాబు పాల్గొన్నారు.